క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



నిర్మించిన నూతన రామాలయం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఈనెల 27నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శ్రీ త్రిదండి చిన్నాజీయర్ స్వామి ఆదేశాలతో త్రయాహ్నిక ఏకకుండాత్మక సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్ర ఆళ్వార్ ఆచార్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ సీతారామ ఆలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం తెలిపారు. అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన ఉపాధ్యాయుడు పోతుగంటి శ్రీనివాస్ విద్యారంగంలో చేస్తున్న సేవలకు గాను హైదరాబాద్‌లో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి గన్నమనేని శ్రీనివాస్‌రావు, ఎడ్ల కిషన్ అభినందనలు తెలిపారు.

ఎన్టీఆర్ భవన్‌కు తరలిన టీడీపీ నాయకులు



తరలివెళ్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన ఇంటింటికీ పార్టీ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఎల్లారెడ్డిపేట నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆవునూరి దయాకర్‌రావు మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్, మాజీ సీఎం చంద్రబాబు హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తరలివెళ్లిన వారిలో నాయకులు తీగల శేఖర్, మాలోతు సూర్యనాయక్, నారాయణగౌడ్, ప్రభాకర్, రాంరెడ్డి, మల్లేశం, ఆయూబ్‌ఖాన్, రాజిరెడ్డి, ప్రశాంత్, సల్మాన్, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి నాగసముద్రాల సంతోష్ తెలిపారు. ఇల్లంతకుంట మారుమూల ప్రాంతం కావడంతో డిగ్రీ విద్యకోసం విద్యార్థులు సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు వెళ్తున్నారని, ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సమీకృత భవనాలు



పట్టణంలో రోడ్డుపై కూరగాయల మార్కెట్..

ప్రారంభానికి సిద్ధం

- రూ.2.70 కోట్లతో మార్కెట్ భవనం ఏర్పాటు
- 102 మందికి ప్రత్యేక స్టాల్స్.
- రూ.4.50 కోట్లతో మరో సమీకృత మార్కెట్ భవనం నిర్మాణం



ప్రారంభానికి సిద్ధమైన కూరగాయల మార్కెట్ భవనం

వేములవాడఅర్బన్: పట్టణంలో చాలా కాలంగా కూరగాయల మార్కెట్ భవనాలు లేక చిరువ్యాపారులు రోడ్లపై కూరగాయలు అమ్ముతున్నారు. ఎండకు, వానలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో కూరగాయల మార్కెట్ నిర్వహించేవారు. ఈక్రమంలో ఇరుకు సందులతో ఇబ్బందిగా జనాలు తాకిడి ఎక్కువగా ఉండడంతో నడిచేందుకు దారిలేకుండా పోయేది.

కరోనాలో తరలింపు..

కరోనా కాలంలో ఉప్పుగడ్డ వీధిలోని కూరగాయల మార్కెట్‌ను వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి తరలించారు. అక్కడ స్థలం విశాలంగా ఉండడంతో జనాల రద్దీ పెరిగినప్పటికీ ఇబ్బంది లేకుండా చేశారు. కాని ధాన్యం కొనుగోళ్ల మార్కెట్‌కమిటీలో ప్రారంభించడంతో కూరగాయల వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. దీంతో వారు అక్కడి నుంచి వేములవాడ మూలవాగు ఒడ్డున రెండో బైపాస్ రహదారి పక్కన కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. కొందరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుటరహదారికి ఇరువైపులా కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. దీంతో ఇప్పటికీ ఆ మార్కెట్ అక్కడే కొనసాగుతోంది.

ప్రారంభానికి సిద్ధంగా భవనం..

వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో అధునాతన వసతులతో వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో మార్కెట్ భవనం నిర్మించారు. ఈ భవనం కోసం మున్సిపల్ నిధుల నుంచి రూ. 2.70 కోట్లతో 10వేల అడుగుల విస్తీర్ణంలో 102 మంది ఒకేసారి కూర్చుని వ్యాపారం చేసుకునేలా స్టాల్స్‌తో కూడిన భవనం నిర్మించారు. ఇందులో అవసరమైన మరుగుదొడ్లు, గదులు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, మిగిలిన కూరగాయలను భద్రపరుచుకునేందుకు శీతల గోదాం కూడా ఏర్పాటుచేశారు. రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా సౌకర్యవంతంగా భవనం నిర్మించారు. ఈ భవనంలో కూరగాయలు, పండ్లు, పూలు మాత్రమే అమ్ముకునేలా వసతులు కల్పించారు. ఈ వారంలో కూరగాయల మార్కెట్ భవనం ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రారంభానికి సిద్ధం చేసినట్లు తెలిపారు.

రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెట్ భవనం

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెట్ భవన నిర్మాణం పనులు వేగంగా నడుస్తున్నాయి. ఇందులో కూరగాయలు, పండ్లు పూలతోపాటు, మాంసం విక్రయాలు నిర్వహించేలా వేర్వేరుగా మార్కెట్ భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనం పనులు పూర్తయితే పట్టణంలోని రెండు చోట్ల ప్రజలకు కూరగాయల మార్కెట్‌లు అందుబాటులో ఉంటాయి. చిరు వ్యాపారులకు అన్ని వసతులు కలిగి ఉండనున్నాయి.

సంతోషంగా ఉంది



కూరగాయలను ఎండలో అమ్మడం ఇబ్బందిగా ఉంది. పట్టణంలోని భగవంతరావునగర్‌లో కూరగాయల మార్కెట్ భవనం పనులు పూర్తయినట్లు తెలిసింది. అందులో ప్రారంభమైతే బాగుంటుంది. ఆ భవనం నిర్మించడం సంతోషకరమైన విషయం.

– శంకర్ కూరగాయల వ్యాపారి, వేములవాడ

వారంలో భవనం ప్రారంభిస్తాం



వేములవాడ పట్టణంలో అన్ని వసతులతో మార్కెట్ భవనం పనులు పూర్తయ్యాయి. కూరగాయలను భద్రపర్చేందుకు శీతల గదిని కూడా ఏర్పాటు చేస్తున్నాం. వారం రోజుల్లో ఈ కూరగాయల మార్కెట్ భవనం ప్రారంభిస్తాము.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ



రహదారిలో పేరుకుపోయిన చెత్త



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వ్యర్థాల తొలగింపు

ముస్తాబాద్: పారిశుధ్య చర్యలకు పంచాయతీ అధికారులు కదిలారు. 'సాక్షి'లో ఈనెల 23న 'పేరుకే టాస్క్‌ఫోర్స్ కమిటీలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ముస్తాబాద్ పట్టణంలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. నిషేధిత ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించకుండా, ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. పోతుగల్ మొర్రాయిపల్లె, దుబ్బాక రహదారిలో పారిశుధ్యసిబ్బంది చెత్తను సేకరిస్తున్నారన్నారు. కమిటీ సభ్యులు కూడా తమకు సహకరించాలని కోరారు. ప్రజలను చైతన్యపరిచేందుకు తమ సిబ్బంది ఉన్నారన్నారు. పట్టణంలోని మారుమూల ప్రాంతాల్లో చెత్తను తొలగించి, మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నామన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలేవి?

- సీపీఐ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య



మాట్లాడుతున్న అంజయ్య

వీర్నపల్లి: మండలం కంచర్ల గ్రామంలో సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగం అంజయ్య ఆదివారం ఒడ్డెరకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఊసేలేదన్నారు. టీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌గా మారి ఆరునెలలు గడుస్తున్నా అదేతీరుగా కొనసాగిస్తోందన్నారు. మండలంలో ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్రూం ఇంటిని నిర్మించలేదన్నారు. కంచర్ల గ్రామంలో మూడు డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణాలు మధ్యలోనే నిలిచాయని దీంతో చెట్లకిందే నివసించే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాట్ల అశోక్, గజ్జెల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచ్ కోల అంజమ్మ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మామిండ్ల తిరుపతిబాబు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఆపద సమయంలో ఈ పథకం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతోందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, పొన్నాల మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, సునీల్, శ్రీనివాస్, రాజేందర్, వెంకటేశ్, సత్తయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి వైద్యానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న భాస్కర్

సిరిసిల్లటౌన్: నిరుపేద కార్మికుడికి వైద్యం అందించేందుకు సిరిసిల్ల భవన కార్మికులు సాయం అందించారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన లింగంపల్లి కనుకయ్య కార్మికుడికి తలలో రక్తనాళాలు గడ్డకట్టి ప్రాణాపాయస్థితిలో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా భవన నిర్మాణ కార్మిక సంక్షేమసంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ పిలుపుతో తోటి కార్మికులు రూ.20వేలు పోగుచేసి ఆదివారం కనుకయ్య కుటుంబసభ్యులకు అందించారు. నిరుపేద వైద్యానికి దాతలు సాయం అందించాలని ఆయన కోరారు. వెంట కార్మికులు ఉన్నారు.

స్వర్ణకారుల కమ్యూనిటీ భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న బాలయ్య

ముస్తాబాద్: మండలంలో స్వర్ణకారులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ముస్తాబాద్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వర్ణకారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. మండలంలో అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాలున్నాయన్నారు. స్వర్ణకారుల కోసం మంత్రి కేటీఆర్ భవనాన్ని మంజూరు చేయాలన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సీసీరోడ్డు నిర్మించాలని, ఆలయంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేయాలని కోరారు. ఆలయం నుంచి మానేరు కాలువ నుంచి మొత్తం సీసీరోడ్డు నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. అర్హులైన స్వర్ణకారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరా రు. కమిటీ బాధ్యులు చింతోజు సంతోష్, చిలుముల నవీన్, సతీశ్, అనిల్, రఘు, సీహెచ్. శ్రీనివాస్, వి. శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



చందుర్తి బస్టాండ్ ప్రాంతంలో తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై నాగరాజు

వేములవాడరూరల్/రుద్రంగి/చందుర్తి/బోయినపల్లి: ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు అన్నారు. వేములవాడ రూరల్ పరిధిలో వాహనాల తనిఖీచేపట్టారు. వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని రుద్రంగి ఎస్సై ప్రభాకర్ హెచ్చరించారు. ఆదివారం రుద్రంగి మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరాలయం ఆవరణలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. చందుర్తి బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతీ వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. బోయినపల్లి మండలకేంద్రంలోని శివారులో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై పుల్లా అభిలాశ్ తెలిపారు. తనిఖీలో వాహన పత్రాలు, నంబర్ ప్లేట్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు లేని 7 వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి ఇంట్లో దాచిన పత్తి దగ్ధమైందని అయిత ఆనందం, మల్లేశం కుటుంబాలను ఆదివారం సాయంత్రం భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు జోగినిపల్లి సంపత్‌రావు, పులి లక్ష్మిపతి సందర్శించారు. విద్యుత్ వైర్లు తెగి మంటలు లేవడంతో పత్తి కాలిపోయిందని అధికారులు ఆదుకోవాలని కోరారు. వారివెంట జేవీవీ రాష్ట్ర నాయకులు సీ.రామరాజు, నర్సయ్య ఉన్నారు.

నిరుపేదకు ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మాజీ అధ్యక్షుడు అశోక్

చందుర్తి: అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైనా వైద్యం చేయించుకునే స్థోమత లేని నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహాకారంతో రూ. 2.50లక్షల ఎల్‌వోసీని అందించినట్లు రుద్రంగి మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్ తెలిపారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన లింగంపల్లి భవానీ మహిళ అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఆరోగ్యం కుదుట పడలేదు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. ఖరీదైనా వైద్యం చేయించే స్థోమత లేక దేవుడిపై భారంవేసి అల్లాడుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు రూ.2.50 లక్షల చెక్కును మంజూరు చేయించామని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. ఎల్‌వోసీ కాపీని ఆదివారం బాధితురాలి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆకుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ ముకుందరెడ్డి, తర్రె లక్ష్మణ్, ఈగ రాజేశం, శ్రీరాముల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జీల పాలన ఇంకెన్నాళ్లు?

- మండలంలో ఇన్‌చార్జి అధికారుల పాలన
- అందుబాటులో లేని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఖాళీలు భర్తీచేయాలంటున్న ప్రజలు



ఎంపీడీవో కార్యాలయం

ఇల్లంతకుంట: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయి అధికారులను నియమించకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రెండేళ్లుగా ఎంపీడీవో పోస్టు ఖాళీగానే ఉంటోంది. ప్రస్తుతం ఎంపీవో మీర్జాకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మండల పశువైద్యశాలలో గాలిపల్లి పశువైద్యాధికారి సతీశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏవో పోస్టు ఐదేళ్లుగా ఖాళీగానే ఉంటోంది. తంగళ్లపల్లి ఏవో సందీప్‌కు ఇల్లంతకుంట ఏవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక పోస్టులన్నీ ఇన్‌చార్జిలతోనే సరిపెట్టడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఇన్‌చార్జీలుగా ఇంకెన్నాళ్లు...

మండలంలో 33 గ్రామాల్లోలున్నాయి. ఎంపీవోకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయాధికారి ఇన్‌చార్జి కావడం, కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలిపల్లి పశువైద్యాధికారికి ఇల్లంతకుంట అదనపు బాధ్యతలు ఉండడంతో 28 గ్రామాల రైతులు పశువులకు వైద్యం కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

పోస్టులు భర్తీ చేయాలి

ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ఎంపీడీవో, పశువైద్యాధికారి, వ్యవసాయాధికారి పోస్టులను భర్తీచేయాలని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఇన్‌చార్జి అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఇబ్బందులు తప్ప డం లేదని అంటున్నారు.

జిల్లా అధికారులకు నివేదించాం



మండల పరిషత్‌లో ఎంపీడీవో, ఏవో, పశువైద్యాధికారి పోస్టులతో పాటు ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీచేయాలని జిల్లా అధికారులకు నివేదించాం. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహాకారంతో అన్నిశాఖల్లో పూర్తిస్థాయి అధికారులు వచ్చేలా చూస్తాం.

– వెంకటరమణారెడ్డి, ఎంపీపీ, ఇల్లంతకుంట

పూర్తిస్థాయిలో నియమించాలి



ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్‌చార్జి అధికారులే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో, ఏవో, పశువైద్యాధికారి, ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలి. పూర్తిసా యి అధికారులను నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.

– బత్తిని స్వామి, రహీంఖాన్‌పేట

గ్రామంలో శునకాల స్వైర విహారం

- రోగాలతో వికృతంగా కుక్కలు
- దూడపై కుక్కల దాడి
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కుక్కల దాడిలో గాయపడిన దూడ



రోగాలతో వికృతంగా కుక్కలు..

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలకేంద్రంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అంటురో గాలతో వికృతంగా తయారయ్యాయి. గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూసి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. చిన్నపిల్లలను బయటికి పంపేందుకు జంకుతున్నారు. ఇళ్లలో కట్టేసిన గేదెలు, ఆవులు, దూడలపై గుంపులుగా వచ్చి కొట్టాలకు చొరబడి దాడిచేస్తున్నాయి. ఇదంతా జరగుతున్నా అధికారు లు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా రు. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రా మస్తులు కోరుతున్నారు.

దూడపై కుక్కల దాడి

రుద్రంగి మండలకేంద్రానికి చెందిన దయ్యాల నర్స య్య పాడి రైతుకు చెందిన దూడను ఎప్పటిలాగే ఇంటిఆవరణలో కట్టేశాడు. శనివారం రాత్రి సుమా రు 6 వీధి కుక్కలు గుంపుగా వచ్చి దూడపై దాడి చే శాయి. దీంతో దూడ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనతో పాడి పశువులతో పాటు ప్రజలకు కూడా హాని ఉందని వెంటనే కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని నర్సయ్య కోరాడు. వీధి కుక్కలు అంటువ్యాధులతో వికృతంగా తయారైనట్లు ప్రజలు వాపోతున్నారు. అలాంటి కుక్కలు ఇళ్లచుట్టూ తిరుగుతండడంతో తాము కూడా రోగాల పాలయ్యే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలతో పాటు పెద్దలపై కూడా కుక్కలు దాడికి తెగబడుతున్నాయని వారు వాపోతున్నారు.



కమ్ముకున్న చీకట్లు

రుద్రంగి: రుద్రంగిలోని రామకిష్టాపూర్‌కాలనీలో వీధి దీపాలు వెలుగక కారు చీకట్లు కమ్ముకున్నాయి. ఏదేని పనిమీద బయటకు వెళ్దామంటే చీకట్లు ఉండడంతో భయాందోళన చెందుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా కాలనీలో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.